క్లుప్తంగా

క్యాన్సర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రెడ్ క్రాస్ చైర్మన్ ప్రసాద్

గుర్ల: మండలంలోని పెద్దబంటుపల్లి సచివాలయం వద్ద విజయనగరం రెడ్ క్రాస్ చైర్మన్ ఆర్.డి.కె. ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయ న మాట్లాడుతూ ఆహార అలవాట్లు మారుతుండడంతో క్యాన్సర్ వ్యాధి అధికంగా వస్తోందని అన్నారు. మద్యం, పొగ తాగడం, గుట్కా వంటి పదార్థాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యం క్షీణిస్తుం దని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. రెడ్‌క్రాస్ సంస్థ ఉచితంగా క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ సతీష్, పంచాయతీ కార్యదర్శి మంత్రి జగదీశ్వరి, రెడ్ క్రాస్ ప్రోగ్రాం ఇన్‌చార్జి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌కి వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందించేందుకు వృద్ధుడి బయోమెట్రిక్ తీసుకుంటున్న వెల్ఫేర్ అసిస్టెంట్ చందన

గుర్ల: మండలంలోని కెల్ల గ్రామానికి చెందిన చెబోలు అప్పలరాజు అనారోగ్యంతో విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఆయనకు నవంబర్ నెలకు సంబంధించిన వృద్ధాప్య పింఛన్ డబ్బులను గ్రామసచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ చందన విశాఖకు వెళ్లి ఆదివారం అందజేశారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా



నృత్యం చేస్తున్న విద్యార్థులు

గజపతినగరం: స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలలో శనివారం రాత్రి నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగాయి. మొదటి సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ, తృతీయ సం వత్సర విద్యార్థులు స్వాగతం పలికారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆకళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసరా వు, అధ్యాపకులు పాల్గొన్నారు.


10న మండల సర్వసభ్య సమావేశం

మెరకముడిదాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 10వ తేదీన ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.రత్నం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరుకానున్నారని పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

కరువు ప్రకటన చేయండి

శృంగవరపుకోట: జిల్లాలో అనేక మండలాల్లో కరువు జాడలు కనిపిస్తున్నాయని, ప్రభుత్వం వెంటనే గ్రామాన్ని ఒక యూనిట్‌గా పరిగణించి కరువు ప్రకటన చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డేగల అప్పలరాజు తదితరులు డిమాండ్ చేశారు. నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో రైతులతో కలిసి ఆదివారం వరి క్షేత్రాలను సందర్శించామని, పలుచోట్ల నీరు లేక వరిపైరు పొట్టదశలో పూర్తిగా ఎండిపోయిందని చెప్పారు. తక్షణం ప్రభుత్వం కరువు ప్రకటించి, పరిహారం అందించాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని కోరారు.

పైడితల్లి దర్శనానికి బారులుతీరిన భక్తులు



అమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు

విజయనగరం టౌన్: పైడితల్లి దర్శనానికి భక్తులు ఆదివారం బారులు తీరారు. ఆలయ ప్రధానార్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు.

ఆయుర్వేదం విశిష్టమైనది..

విజయనగరం టౌన్: ఆయుర్వేద వైద్యం అత్యంత విశిష్టమైనదని ప్రముఖ న్యాయవాది, వ్యాపారవేత్త పీవీ రామారావు అన్నారు. నా ఊరు విజయనగరం సంస్థ, వనిత వాకర్స్ క్లబ్, తిలక్ ఫౌండేషన్, విశ్వ కళాపరిషత్, గురజాడ బ్రాహ్మణ సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఆయుర్వేద దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కణపాక యూత్ హాస్టల్‌లో నిర్వహించిన వేడుకలకు పీవీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయుర్వేద వైద్యం ప్రాముఖ్యత అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందించిన వారితో పాటు ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులను సత్కరించారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే..
- సచివాలయ, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ల భవనాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



కాలంరాజుపేట ఆర్బీకే భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య, నాయకులు



కాలంరాజుపేట సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

మెంటాడ(గజపతినగరం రూరల్): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పిన గ్రామసచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని కాలంరాజుపేట గ్రామంలో సచివాలయం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే) భవనాలను, మధుపాడలో సచివాలయం, ఆర్బీకే భవనాలను, పురిటిపెంట గ్రామంలో సచివాలయ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించా రు. ఈసందర్భంగా మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని సచివాలయవ్యవస్థ ఏర్పాటుతో సీఎం జగన్ సాకారం చేశారని అన్నారు. ప్రజలు జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పనిలేకుండా గ్రామసచివాలయాల్లోనే ప్రభుత్వ సేవలన్నీ అందుతున్నాయని, ఈఘనత సీఎం జగన్‌కే దక్కు తుందన్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో రాయితీపై గ్రామాల్లోనే అందిస్తున్నామని, గతంలో ప్రభుత్వసేవలు, విత్తనాలు,ఎరువుల కోసం మండల, జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు, రైతులు కాళ్లరిగేలా తిరిగేవారని గుర్తు చేశారు. హెల్త్ వెల్‌నెస్‌కేంద్రాల పల్లెప్రజలకు ద్వారా వైద్యసేవలు చేరువయ్యాయన్నారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆస్పత్రులను ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తున్నామని, అవినీతికి తావులేకుండా సుపరిపాలన అందిస్తున్నా మని అన్నారు. ఎవరి సిఫార్సులు అవసరం లేకుండా పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు మంజూరు చేస్తున్నామని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో అరకొరగా అమలు చేసిన పథకాలను సైతం ఆ పార్టీ సాను భూతిపరులు, జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చిన వారికే మంజూరు చేసేవారని గుర్తు చేశారు. స్థానిక సర్పంచ్ గేదెల ఈశ్వరరావు, ఎంపీటీసీ గేదెల జగదీష్, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, నాయకులు పైడుపునాయుడు, బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, మండల వ్యవసాయ సలహా మండలి సంఘం అధ్యక్షుడు సామంతులు పైడిరాజు, మాజీ జెడ్పీటీసీ మక్కువ శ్రీధర్, దొగ్గదేవుడు, ఎంపీడీఓ కిశోర్‌కుమార్, తహసీల్దార్ అరుణకుమారి, పీఆర్ డీఈ అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.9 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం



చీపురుపల్లిలో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసనాయుడు,తదితరులు

చీపురుపల్లి: పట్టణంలోని రెండో ఎంపీటీసీ ప్రాదేశికం పరిధిలో సిమెంట్ రోడ్లు, వీధి కాలువల పనులు చురు గ్గా సాగుతున్నాయి. ఇక్కడ సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణానికి ఎంపీపీ ఇప్పిలి వెంకటనరమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష మండల పరిషత్, జిల్లా పరిషత్ నుంచి రూ.9 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో 90 మీటర్ల సిమెంట్ రోడ్డుతో పాటు వీధి కాలువ నిర్మిస్తున్నారు. ఈ పనులనువైఎస్సార్‌సీపీ మండల నాయకుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, స్థానిక నాయకుడు ఎల్.ప్రభాత్ తదితరులు ఆదివారం పరిశీలించారు.

ప్రజాసంకల్పయాత్రకు ఆరేళ్లు

- నేడు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వేడుకలు

బొండపల్లి: వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్రకు నేటితో ఆరేళ్లు పూర్తయ్యింది. ఈసందర్భంగా నియోజకవర్గ కేంద్రం గజపతినగరంలోని పార్టీ కార్యా లయంలో సోమవారం వేడుకలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆది వారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం పార్టీ నాయకులు, నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కార్పొరేషన్‌ల చైర్మన్ లు, డైరెక్టర్లతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి అన్ని మండలాల నాయకులు హాజరు కావాలని కోరారు.

ఓటరు నమోదులో బీఎల్ఓలదే కీలకపాత్ర



చీపురుపల్లి: కర్లాంలో పోలింగ్ బూత్‌లో ఓటర్ల నమోదు ప్రక్రియ పరిశీలిస్తున్న ఆర్డీఓ శాంతి



బొండపల్లి: బిల్లలవలసలో ఓటరు జాబితాలను పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ శంకరరావు



బొండపల్లి: నెలివాడలో ఓటు హక్కు నమోదు కోసం దరఖాస్తు అందజేస్తున్న యువకుడు



గంట్యాడ: నరవలో యువతి నుంచి ఓటు నమోదు దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ నీలకంటేశ్వరరెడ్డి



కొత్తవలస: కొత్తవలసలో ఓటర్ నమోదు పక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసమిశ్ర



లక్కవరపుకోట: కిత్తన్నపేటలో దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ కల్యాణచక్రవర్తి



శృంగవరపుకోట: ఎస్.కోటలో యువకుడి నుంచి ఓటు హక్కు నమోదు దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు



దత్తిరాజేరు: టి.భూర్జవలసలో ఓటరు జాబితా పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్



మెరకముడిదాం: మెరకముడిదాం పోలింగ్ కేంద్రంలో ఓటర్ల జాబితాపై తహసీల్దార్‌కు సూచనలు చేస్తున్న ఆర్డీఓ శాంతి

చీపురుపల్లి/ మెరకముడిదాం: అర్హత కలిగిన ప్రతి ఒక్కరితో ఓటు హక్కు నమోదుకు దరఖాస్తు చేయించాలని చీపురుపల్లి ఆర్డీఓ బి.శాంతి బీఎల్ఓలకు సూచించారు. ప్రత్యే క ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా చీపు రుపల్లి మండలంలోని కర్లాం గ్రామంలో 169, 170,171, 172 పోలింగ్ కేంద్రాల్లో, మెరకముడిదాం మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన శిబిరాలను ఆర్డీఓ సందర్శించారు. ఓటర్ల నమోదు ప్రక్రి యను పరిశీలించి, ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఇంతవరకు ఎంతమంది ఓటర్లు ఉన్నారు, కొత్తగా ఎంతమంది ఓటు హక్కు నమోదు చేసుకున్నారు తదితర అంశాలను బీఎల్ఓలను అడిగి తెలుసు కున్నారు. ఓటరు నమో దు ప్రక్రియలో బీఎల్ ఓలదే కీలకపాత్ర అని ఆమె అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హ క్కు నమోదు చేయడంతో పాటు, అర్హత లేని వారిని, మరణించిన వారిని జాబితాల నుంచి తొలగించి తప్పులు లేని జాబితా సిద్ధం చేయాలని సూచించారు బీఎల్ఓల పనితీరుపై పరిశీలన ఉంటుందని స్పష్టం చేశారు. ఆర్డీఓ వెంట చీపురుపల్లి, మెరకముడి దాం తహసీల్దార్‌లు ఎం.సురేష్, విజయభాస్కర్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తదితరులు ఉన్నారు.

పక్కాగా ఓటరు జాబితా

బొండపల్లి: ఓటరు జాబితా పక్కాగా రూపొందించాలని డిప్యూటీ తహసీల్దార్(డీటీ) ఆర్.శంకరరావు బీఎల్ఓలకు సూచించారు. ప్రత్యేక ఓటరు నమోదు, జాబితాల పరిశీ లన శిబిరాలు రెండో రోజు ఆదివా రం మండలంలోని అన్ని గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో కొనసాగాయి. పలుగ్రామాల్లో శిబిరాలను డీటీ సందర్శించారు. 18 ఏళ్లు నిండిన వారి నుంచి ఓటు హక్కు నమోదుకు దరఖాస్తులు తీసుకోవడంతో పాటు, చనిపోయిన వారి ఓట్లను సంబంధించి కుటుంబ సభ్యుల అనుమతితో తొలగించాలని బీఎల్ఓ లు, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సీనియర్ సహాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొ న్నారు.

అర్హులతో ఓటుహక్కు దరఖాస్తు చేయించాలి

దత్తిరాజేరు: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలు నిర్వహించారు. వంగర, వి.కృష్ణాపురం గొభ్యాం, బలభద్రరాజుపురం, టి.భూర్జవలస పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నమోదు,తొలగింపుల ప్రక్రియను తహసీల్దార్ రమేష్ పరిశీలించారు.18 ఏళ్లు నిండిన వారందరితో ఓటు హక్కుకు దరఖాస్తు చేయించాలని బీఎల్ఓలకు సూచించారు.

తప్పులు లేని జాబితానే లక్ష్యం

గంట్యాడ: తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేయడమే లక్ష్యంగా బీఎల్ఓలు,రెవెన్యూ సిబ్బంది పనిచేయాలని, జాబితాలో ఓటర్ల వివరాలను నిశితంగా పరిశీలిం చాలని తహసీల్దార్ పి.నీలకంటేశ్వ రరెడ్డి అన్నారు. ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా నరవ, కొఠారుబిల్లి పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన శిబిరాలను ఆది వారం ఆయన పరిశీలించారు. ఓటు ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీఎల్ఓలకు సూచించారు. ఆర్ఐ హరిప్రియతదితరులు పాల్గొన్నారు.

393 అర్జీలు

శృంగవరపుకోట: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈఆర్ఓ నేతృత్వంలో రెవెన్యూ అధికార యంత్రాంగం ఓటర్ల చేర్పులు, మార్పులు, నమోదులు, తొలగింపులు వంటి అంశాలపై దృష్టి సారించింది. శని, ఆదివారాల్లో రెండు రోజులు ఉదయం నుంచి సాయంత్రం 5గంటల వరకు బీఎల్ఓలు వారికి నిర్దేశించిన పోలింగ్ బూత్‌ల వద్ద ఉండి ఓటరు నమోదు, మార్పులు చేర్పు లకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించారు. ఆర్ఓ సుదర్శన్‌దొర, తహసీల్దార్ శ్రీనివాసరావు మండలంలోని ఎస్.కోట, సీతంపేట, గోపాలపల్లి, సీతారాంపురం, ధర్మవరం, చామలాపల్లి, ఆలుగుబిల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం సందర్శించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రెండు రోజుల్లో మొత్తంగా 393 అర్జీలు అందాయని చెప్పారు.

విశేష స్పందన

కొత్తవలస/లక్కవరపుకోట: కొత్తవలస,ఎల్.కోట మండలాల్లో శని,ఆదివారాల్లో రెండు రోజులు నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలకు విశేష స్పందన లభించింది. ఎస్.కోట నియోజకవర్గం పరిధిలోని అయిదు మండలాల్లో రెండురోజుల్లో అందిన దరఖాస్తుల వివరాలను నియోజకవర్గ ఎలక్షన్ డీటీ నారాయణమ్మ వెల్లడించారు.ఎస్.కోట మండలంలో ఓటు హక్కు కోసం ఫారం–6లు 190, ఓట్ల తొలిగింపునకు ఫారం–7లు 87, ఓట్లు బదిలీ, దిద్దుబాట్లకు సంబంధించి ఫారం–8లు 116 వచ్చినట్లు తెలిపారు. వేపాడ మండలంలో ఫారం–6లు 111, ఫారం–7లు 41, ఫారం–8లు 43 వచ్చాయన్నారు. అలాగే ఎల్.కోట మండలంలో ఫారం–6లు 159, ఫారం–7లు 28, ఫారం–8లు 76, కొత్తవలస మండలంలో ఫారం–6లు 234, ఫారం–7లు 37, ఫారం–8లు 148, జామి మండలంలో ఫారం–6లు 151, ఫారం–7లు 27, ఫారం–8లు 33 వచ్చాయన్నారు.కొత్తవలస మండల కేంద్రంలోని ఎంపీపీ స్కూల్‌తో పాటు పలుగ్రామాల్లో శిబిరాలను తహసీల్దార్ శ్రీనివాసమిశ్ర, లక్కవరపుకోట మండలంలోని కిత్తన్నపేట గ్రామంలో పోలింగ్ కేంద్రంలో ఓటర్ల నమోదును తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి పరిశీలించారు.

అమ్మవారికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న దేవస్థానం కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ఆదివారం పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు

జామి: మండలంలోని విజినిగిరి గ్రామంలో హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సేవాసంస్థ ఆధ్వర్యంలో 21 మంది పేద వృద్ధులు, ఒంటరి మహిళలకు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ప్రతీ నెల పేదలకు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని ఆ సంస్థ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కొవ్వాడ సన్యాసినాయుడు, కిలారి శ్రీనివాసరావు, అల్లు సన్యాసినాయుడు, వి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గౌరమ్మ సంబరాలు ప్రారంభం



గౌరమ్మ ఊరేగింపులో గ్రామస్తులు

జామి: మండలంలోని కుమరాం గ్రామంలో 21 రోజుల పాటు నిర్వహించనున్న గౌరమ్మ సంబరాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామస్తులు వరి దుబ్బును గ్రామంలోని గౌరమ్మ శతకం పట్టువరకు ఊరేగించారు. అనంతరం వ రి దుబ్బును గద్దెపై పెట్టి పసుపు,కుంకుమతో అలంకరించారు. గ్రామస్తులు గౌర మ్మ పాటలు పాడి ఉత్సవాన్ని ప్రారంభించారు. ఏటావరి పంట పండిన తర్వాత ఈ సంబరం చేయడం ఆనవాయితీగా వస్తోందని గ్రామపెద్దలు తెలిపారు. సర్పంచ్ పిన్నింటి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఐక్యత



పరదేశమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు,తదితరులు

లక్కవరపుకోట: ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణతో ప్రజల మధ్య ఐక్యత పెరుగుతుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని లచ్చింపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన పరదేశమ్మతల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం నిర్వహించారు. అమ్మవారిని ఎమ్మెల్యే స్థానిక నాయకులు, పెద్దలతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు,ఎంపీటీసీ భూమిరెడ్డి స్వామినాయుడు, ఏఎంసీ డైరెక్టర్ కొట్యాడ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు భూమిరెడ్డి రామారావు, బోకం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడమే ఫుడ్ బ్యాంక్‌ల లక్ష్యం



అనాథలకు భోజనం వడ్డిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: వివిధ అవసరాల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చే పేదలు ఆకలితో తిరిగి వెళ్లకూడదనే ఉద్దేశంతో నగరంలో ఆరు ఫుడ్‌బ్యాంక్‌ల ద్వారా ఉచితంగా ఆహారం అందిస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శ్రీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఎన్‌సీఎస్ రోడ్డులో నిర్వహిస్తున్న ఫుడ్ బ్యాంక్‌కు రెండేళ్లు పూర్తి కావడంతో ఆదివారం చేపట్టిన భోజన వితరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పేదలకు స్వయంగా వడ్డించారు. అనంతరం కోలగట్ల మాట్లాడుతూ.. నగరంలోని ఆరు ఫుడ్ బ్యాంకుల ద్వారా నిత్యం వందలాది మందికి ఉచితంగా భోజనం పెడుతున్నామని తెలిపారు. తన ఆశయానికి గౌరీ సేవా సంఘం, గవర సామాజికవర్గ పెద్దలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ఈ రోజున వివాహ విందులా సుమారు 16 రకాలతో భోజనం పెట్టడం ఆనందంగా ఉందని, గౌరీ సేవా సంఘ సభ్యులు భవిష్యత్‌లో ఇటువంటి సమాజ హిత కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గౌరీ సేవా సంఘ ప్రతినిధులు కనిశెట్టి సుధాకర్, అడారి నగేష్, ఓం శంకర్, కాంద్రేగుల శేఖర్, మొల్లేటి నాయుడు, అడారి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.